శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహహోమం

ఊంజల్‌సేవలో భాగంగా అమ్మవారిని ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 9: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. భూతపేత పిశాచాల బాధలు తొలగి, ఇలలోక సుఖాలు, పరలోక మోక్షాలు సిద్ధించే హోమంలో భక్తులు పాల్గొని మొక్కు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతును నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామి, అమ్మవార్లకు నిత్యపూజలు వైభవంగా సాగాయి. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్‌సేవను అత్యంత వైభవంగా జరిపారు. అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యపూజలు స్మార్తగమశాస్త్రరీతిలో జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,54,435 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

నాగుల పంచమి వేడుకలు..

శ్రావణమాసం తొలి శుక్రవారంతో పాటు నాగుల పంచమి సందర్భంగా స్వామివారి కొండపైకి వెళ్లే మొదటి ఘాట్‌రోడ్డుపై వెలసిన పుట్ట వద్ద స్థానిక భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. పుట్టలో పాలు పోసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం కొండపైన స్వయంభూ పంచనారసింహస్వామివారిని దర్శించుకున్నారు.

మోదీ ప్రభుత్వ విధానాలపైన పోరాటాలకు సిద్ధం కావాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ.ఇమ్రాన్

కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు వ్యతిరేక విధానాలపై ర్యాలీ తీస్తున్న కార్మికులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండీ. ఇమ్రాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చ పిలుపు మేరకు సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘాల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని ప్రిన్స్‌చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిశ్ వారిని దేశం నుంచి తరమి కొడదాం.. దేశాన్ని రక్షించుకుందామనే ఉద్దేశ్యంతో ఆగస్టు 9, 1942న ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు క్విట్ ఇండియా పిలుపునిచ్చారన్నారు. నేడు ప్రధాని నరేంద్ర మోదీ స్వదేశీ ముసుగులో దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నాడని విమర్శించారు. మూడోసారి అధికారం చేపట్టిన వెంటనే బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్లను నోటిపై చేయడంతో పాటు కొత్త చట్టాలను తీసుకొచ్చి పేదలకు న్యాయం అందని ద్రాక్షలా మార్చిందన్నారు. తెలంగాణ ఓట్లతో పార్లమెంటుకు వెళ్లిన మంత్రి కిషన్‌రెడ్డి మన రాష్ట్రంలోని బొగ్గు బ్లాక్‌ను వేలం వేయడం బీజేపీ పార్టీ నిజ స్వరూపానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు, సహాయ కార్యదర్శి మాయకృష్ణ, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లక్ష్మి

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 9 : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి అన్నారు. జిల్లా మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ, ఐసీడీఎస్ బోల్లేపల్లి సెక్టార్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని తాజ్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం, రక్తహీనత, నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం కో-ఆర్డినేటర్ హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకు కూరలతో రక్తహీనతకు చెక్

- జిల్లా స్త్రీ శిశు సంక్షమ శాఖ అధికారి కృష్ణవేణి

సదస్సులో మాట్లాడుతున్న కృష్ణవేణి

వలిగొండ, ఆగస్టు 9: గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి బయట పడవచ్చని జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి సూచించారు. శుక్రవారం మండలంలోని గొల్నెపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. తరచుగా పాలకూర, బచ్చలి కూరతో పాటు మునగ ఆకును కూరల్లో వినియోగించాలని, బెల్లం, పల్లిపట్టీలు, నువ్వులు, పండ్లు, పచ్చని కూరగాలు తీసుకోవాలని సూచించారు. 6 నెలలు దాటిన చిన్నారులకు అన్నప్రాసన చేయించాలని తల్లులకు సూచించారు. మండలంలోని మల్లేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో రామన్నపేట సీడీపీఓ వెంకటరమణ పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పారిజాత, కళావతి, అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, భాగ్యలక్ష్మి, వసంత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామక పత్రాలను అందుకున్న పద్మశాలి సంఘం కార్యవర్గం

పద్మశాలీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

యాదగిరిగుట్ట, ఆగస్టు 9: పట్టణ పద్మశాలీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి దీకొండ వెంకటేశ్, కోశాధికారి మెరుగు మధుసూదన్, ఉపాధ్యక్షులు మండల శ్రీనివాస్, యెర్రగుంట్ల చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులు ఎక్కలదేవి భాస్కర్, కుసుమ రాజు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కా వెంకటేశ్వర్లు కొత్త కార్యవర్గాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించి, నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి అన్నదానసత్రం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు దీకొండ జోగయ్య సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే

బ్రాహ్మణపల్లి గ్రామంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే

బీబీనగర్, ఆగస్టు 9 : పిల్లలు, తల్లుల ఆరోగ్యం కోసమే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నదని, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జండగే అన్నారు. బీబీనగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శుక్రవారం సభలో ఆయన పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం, రక్తహీనత నివారణను తగ్గించడంతోపాటు సాధారణ ప్రసవాల పెంపు లక్ష్యంగా శుక్రవారం సభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ఒకపూట సంపూర్ణ భోజనాన్ని తినాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే పిల్లల బరువు, ఎత్తు కొలుస్తూ.. పిల్లల ఎదుగుదలను గమనిస్తూ అంగన్‌వాడీ టీచర్ సలహాలు పాటించాలని, ఇంటి వద్ద కూడా పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించే ప్రీ ప్రైమరీ స్కూల్‌కు పంపిస్తూ పిల్లల మానసిక, శారీరక దృఢత్వానికి తోడ్పడాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.కృష్ణవేణి, ఎంపీడీఓ శ్రీనివాస్, సీడీపీఓ శైలజ, సూపర్‌వైజర్ కరుణ, గ్రామపంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భువనగిరి సబ్ జైల్‌ను పరిశీలించిన సీనియర్ జడ్జి

సబ్‌జైల్ అధికారులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మాధవీలత

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: భువనగిరి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత శుక్రవారం సబ్‌జైల్‌ను సందర్శించారు. జైలులో ప్రిసన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా ఖైదీలకు న్యాయ సేవలు అందే విధంగా చూడాలని అధికారులకు ఆమె సూచించారు. ఖైదీలకు న్యాయ సహాయ కేంద్రం న్యాయవాదులు ఎస్.జైపాల్, జి.శంకర్ ద్వారా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

ఉపాధిహామీ కూలీల వేతనాలు చెల్లించాలి : సీపీఐ

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

ఆలేరురూరల్,ఆగస్టు9 : ఉపాధిహామీ కూలీలకు చెల్లించాల్సిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆలేరులో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిల్లులు రాక కార్మికులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు చౌడబోయిన పర్శరాములు, మల్లయ్య, ఆంజనేయులు, ప్రవీణ్ పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్‌రావు

ఆలేరురూరల్,ఆగస్టు9 : ఇఫ్కోవారి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొలనుపాక రైతువేదికలో నానో యూరియా, డీఏపీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నానో యూరియా వాడడం వల్ల భూసారాన్ని కాపాడుకోవడమే కాకుండా తక్కువ ఖర్చుతో మొక్కలకు నత్రజనని అందించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఇఫ్కో మేనేజర్ సూరజ్‌కుమార్, ఏఓ దీప్తి, ఏఈఓలు శివకుమార్, నాగార్జున, శాలిని, రైతులు పాల్గొన్నారు.

బోనాలతో ఆలయాలనికి తరలి వెళ్తున్న కళాశాలల విద్యార్థినులు

బోనాలతో విద్యార్థినుల సందడి

చౌటుప్పల్, ఆగస్టు 9 : పట్టణకేంద్రంలోని నలంద డిగ్రీ, అరవిందో జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు స్వయంగా బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో జాతీయ రహదారిపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన స్వచ్ఛదనం-పచ్చదనం

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు, డ్రైనేజీల పూడికతీత, మొక్కలు నాటడం వంటి పనులు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు పలువార్డుల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. వార్డులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు నివారించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. 35వ వార్డులో కౌన్సిలర్ తంగళ్లపల్లి శ్రీవాణీరవికుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రత్యేకాధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పైళ్ల పుట్టినరోజు వేడుకలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 9: భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించేనున్నట్లు బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ.కిరణ్‌కుమార్, జనగాం పాండు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ఏరియా దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెండ్లు పంపిణీ, రైతు బజార్ వద్ద రక్తదాన శిబిరం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ట్రాక్టర్‌కు నిప్పు

ఆలేరురూరల్, ఆగస్టు 9 : మండలంలోని పటేల్‌గూడెం గ్రామానికి చెందిన యాదిరెడ్డి గురువారం ట్రాక్టర్‌తో పొలం పనులు చేపట్టి రాత్రి ట్రాక్టర్‌ను పొలం వద్దే వదిలి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్ పూర్తిగా కాలిపోయి ఉంది. అదే గ్రామానికి చెందిన కందడి శేఖర్‌రెడ్డి, కందడి ప్రకాశ్‌రెడ్డి కూలీలతో కలిసి తన ట్రాక్టర్‌పై పెట్రోల్ పోసి తగుల బెట్టారని ఆరోపిస్తూ యాదిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట శ్రీను తెలిపారు.

దారి దోపిడీకి పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

చౌటుప్పల్‌రూరల్,ఆగస్టు 9 : చౌటుప్పల మండలం దండు మల్కాపురం గ్రామ పరిధిలో శ్రీఆధ్యా హోటల్ వద్ద ఇద్దరు దొపిడీ దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ ఎం. సుధీర్‌బాబు, భువనగిరి డీసీపీ ఎం. రాజేశ్‌చంద్ర వివరాలు వెల్లడించారు. దండుమల్కాపురం గ్రామ పరిధిలో ఉన్న శ్రీ ఆధ్యా హోటల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం ధర్మపురి గ్రామం ధార్ జిల్లాకు చెందిన అలీఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి విచారించారు. అతను చెప్పిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోనీ ఠాకూర్(22)ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 1832 గ్రాముల బంగారం, రూ.1,26,88,432 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరు ముంబాయి నుంచి ఇతర రాష్ట్రాలకు రహదారి వెంట వెళ్లే బస్సుల్లో దోపిడీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తమ వాహనాలకు నకిలీ నంబర్ ప్లేట్‌లను ఉపయోగించి పోలీసులకు దొరక్కుండా జాగ్రత్త వహించే వారని పేర్కొన్నారు.

10 నుంచి భువనగిరిలో ఆవాజ్ విద్యావైజ్ఞానిక సదస్సు

రామన్నపేట, ఆగస్టు 9: ఈ నెల 10, 11 తేదీల్లో భువనగిరి పట్టణ కేంద్రంలో జరిగే ఆవాజ్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక సదస్సును జయప్రదం చేయాలని ఆవాజ్ జిల్లా కార్యదర్శి మీర్ ఖాజా అలీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ఇంద్రపాలనగరంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. మైనార్టీల్లో పెరుగుతున్న నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం వెననుకబాటుతనం వంటి సమస్యలతోపాటు లౌకిక ప్రజాస్వామ్య హక్కులకోసం సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ జానీఖాన్, ఖాదర్, నసీర్, వాజిద్‌అలీ, అలీం, అహ్మద్‌అలీ, సాజిద్, ఖలీల్, బషీర్, చాంద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

- ఆలయాల్లో మహిళల ప్రత్యేక పూజలు
- పుట్టలో పాలు పోసి మొక్కుల చెల్లింపు

ఆలేరు రూరల్ : కొలనుపాకలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మోటకొండూర్, ఆగస్టు 9: శ్రావణమాసం తొలి శుక్రవారంతో పాటు నాగుల పంచమి సందర్భంగా ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉపవాస దీక్షలు చేపట్టారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నాగదేవతకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం, మహమ్మాయి ఆలయ పుట్ట వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

చౌటుప్పల్‌లో నాగదేవతకు పూజలు చేస్తున్న మహిళలు

భూదాన్‌పోచంపల్లి : పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు(ఎం) కప్రాయపల్లిలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం),ఆగస్టు 9 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి అన్నారు.

మండలంలోని కప్రాయపల్లిలోని శివాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కప్రాయపల్లిలోని శివాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.48 లక్షలు మంజూరు చేయడంతో పాటు ఆలయానికి వెళ్లే దారిని సీసీగా మార్చినట్లు తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాకేశ్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ కవిత, నాయకులు భిక్షపతి, ప్రకాశ్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

సైదాపురంలో మొక్క నాటుతున్న ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, ఆగస్టు 9: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని సైదాపురం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. తమ ఇంటిచుట్టు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నవీన్‌కుమార్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, ఏపీఓ నారాయణ, ఎంపీఓ, ఈసీ, పంచాయతీ కార్యదర్శి, ఆటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రాయిపల్లిలో రూ.5లక్షలతో గౌడసంఘం భవనం, మండల కేంద్రంలో రూ.5 లక్షలతో నాయీ బ్రాహ్మణ సేవాసంఘం భవనం, రూ.5 లక్షలతో సారగండ్లగూడెంలో సీసీ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. కప్రాయపల్లిలోని శివాంజనేయ ఆలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్టాపనలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్, పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంగమ్మ, మాజీ జడ్పీటీసీ నరేందర్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ నగేశ్, వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.


వంకమామిడి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో యంత్ర ప్రాణ ప్రతిష్ఠాపన

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 9 : మండలంలోని వంకమామిడి గ్రామంలో సురమాంబ సమేత కంట మహేశ్వర స్వామి, రేణుకా ఎల్లమ్మ వనం మైసమ్మ ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ సహోమం, యంత్ర ప్రాణ ప్రతిష్ఠ, శాంతి కల్యాణం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, గౌడసంఘం అధ్యక్షుడు సుర్వి సత్యనారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ బత్తుల మాధవీ శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచులు బొడిగి శంకరయ్యగౌడ్, సామ రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీతారామాలయంలో ఘనంగా కుంకుమార్చన పూజలు

కుంకుమార్చానలో పాల్గొన్న మహిళలు

చౌటుప్పల్, ఆగస్టు 9 : పట్టణకేంద్రంలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం కుంకుమార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కాశీ నుంచి తెప్పించిన మహాలక్ష్మీ శ్రీ చక్రం యంత్రాలపై 400 మంది మహిళలు కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, గున్న రాజేందర్ రెడ్డి, యానాల ప్రభాకర్ రెడ్డి, కేవీబీ కృష్ణారావు, వెన్‌రెడ్డి సంధ్యా, ఉజ్జిని మంజుల, బొబ్బిళ్ల సంధ్య, శ్రీలత పాల్గొన్నారు.

ఆయుర్వేదం వైద్యం మానవాళికి వరం

- ఆయుశ్ వైద్యుడు క్రాంతి

చరకుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మలరామారం,ఆగస్టు9 : ఆయుర్వేద వైద్యం మానవాళికి వరంలాంటిదని ఆయుశ్ డాక్టర్ క్రాంతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుశ్ కేంద్రంలో శుక్రవారం ఆయుర్వేద వైద్య పితామహుడు చరకుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చరకుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి క్రాంతి కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయా